క్లుప్తంగా

30 నుంచి కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాలు

నాయుడుపేటటౌన్: తుమ్మూరులోని శ్రీదేవి,భూదేవి సమేత కరిమాణిక్యస్వామి బ్రహ్మోత్సవాలను ఈనెల 30 నుంచి జూన్ 9 వరకు నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ డిప్యూటీ ఈఓ శాంతి శనివారం తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో 30న అంకురార్పణతో ప్రారంభిస్తారని ఆమె తెలిపారు. 31న ఉదయం ధ్వజారోహణంరథోత్సవం 6వ తేదీన ఉదయం జరుగుతుందన్నారు.

సమాధుల తోట అభివృద్ధికి చర్యలు

గూడూరురూరల్: స్థానిక గాంధీనగర్‌లో ఉన్న క్రైస్తవుల సమాధుల తోట అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు ది గూడూరు ఇంటర్ డినామినేషనల్ క్రిస్టియన్ సెమిత్రీ సొసైటీ అధ్యక్షుడు పాస్టర్ పూలా డానియేల్ రవికుమార్ తెలిపారు. శనివారం గూడూరులోని సార్వత్రిక క్రైస్తవ ప్రార్థన మందిరంలో సెమిత్రీ సొసైటీ సమావేశం నిర్వహించారు.

విద్యార్థులకు ఆటల పోటీలు

రాపూరు: రాపూరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులకు వస్తున్న విద్యార్థులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారిణి ధనమ్మ తెలిపారు. విజ్ఞానంతో పాటు ఆటవిడుపుగా ఆటల పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

మున్సిపల్ లీగల్ అడ్వైజర్ నియామకం


జయప్రకాష్‌శెట్టి

వెంకటగిరి: వెంకటగిరి మున్సిపల్ లీగర్ అడ్వైజర్‌గా పి.జయప్రకాష్‌శెట్టి నియమితులయ్యారు. తనకు రెండోసారి అవకాశం ఇచ్చిన రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్‌మెంట్‌బోర్డు చైర్మన్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, సహకరించిన రాజాకుటుంబీకులు ఎస్వీ బీసీ చైర్మన్ డాక్టర్ వీబీ సాయికృష్ణ యాచేంద్ర, సర్వజ్ఞకుమార యాచేంద్ర, కౌన్సిల్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సేవలు అభినందనీయం


పద్మావతిని సత్కరిస్తున్న సీడీపీఓ

చిల్లకూరు: బూదనం గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పనిచేస్తున్న పద్మావతి శనివారం పదవీ విరమణ సందర్భంగా చిల్లకూరు సెక్టార్ పరిధిలోని అన్ని అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి ఆమెను చిల్లకూరులోని అంగన్‌వాడీ కేంద్రంలో 35 సంవత్సరాల ఆమె సేవలను కొనియాడి సత్కరించారు. చిల్లకూరు సెక్టార్‌లోని అంగన్‌వాడీ టీచర్లు అందరూ ఆమెను సత్కరించారు. అసిస్టెంట్ సీడీపీఓ జ్యోతి, సూపర్‌వైజర్ నాగిశెట్టి రేణుక, టీచర్లు, ఇందిరమ్మ, కమల, పెంచలమ్మ, రాధా, సుజాత, ప్రసన్న, భారతమ్మ, పాల్గొన్నారు.

రూ.లక్ష విరాళం

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి నిత్యాన్నదాన పథకానికి శనివారం వైఎస్సార్ జిల్లా బద్వేల్ అశోక్‌నగర్‌కు చెందిన పెద్దనరసింహారెడ్డి, ధర్మపత్ని వెంకటరమణమ్మ రూ.1,00,116 నగదు విరాళంగా అందించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ప్రజాసమస్యలను పరిష్కరించండి


రికార్డులను పరిశీలిస్తున్న సీఈఓ చిరంజీవి

రాపూరు: ప్రజాసమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా పరిషత్ సీఈఓ చిరంజీవి తెలిపారు. రాపూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయాన్ని, వేపినాపి సచివాలయాన్ని శనివారం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ వీర్రాజులు, సీనియర్ అసిస్టెంట్ చంద్రశేఖర్, సిబ్బంది ఉదయిని, కరుణాకర్, అన్సర్‌బాబా ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణపై నిర్లక్ష్య వైఖరి

నాయుడుపేటటౌన్: ఎస్సీ వర్గీకరణను చట్టబద్ధత కల్పించడంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని స్థానిక ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నేతలు విమర్శించారు. పట్టణంలోని ఎల్‌ఏ సాగరంలో ఎంఆర్‌పీఎస్ నేత రవి అధ్యక్షతన పట్టణ కమిటీ సమావేశం జరిపారు. ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ పట్టణ కమిటీలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. ఎంఆర్‌పీఎస్ పట్టణ అధ్యక్షుడిగా మొండెం సురేష్, కార్యదర్శి ఇలూపురు ఉదయ్, ఉపాధ్యక్షుడు మాసారం శీను, ఎంఎస్‌పీ అధ్యక్షుడిగా కే క్రాంతికుమార్, కార్యదర్శి మొండెం రత్నయ్య, ఉపాధ్యక్షుడు ఎం వీరరాఘవులును ఎంపిక చేసినట్లు ప్రకటించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

మనుబోలు: ఇద్దరు వ్యక్తులు మోటార్ బైక్‌పై రోడ్డు దాటుతుండగా ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన బద్దెవోలు క్రాస్‌రోడ్డు వద్ద శనివారం జరిగింది. కోట మండలం చెంబడిపాళెం గ్రామానికి చెందిన కట్టా వీరాస్వామి(45) బోర్లు వేస్తూ జీవనం సాగిస్తాడు. మనుబోలు బద్దెవోలు గ్రామంలో బోరు వేసేందుకు తన సహచరుడు కొల్లు సునీల్‌కుమార్‌తో కలిసి బైక్‌పై బద్దెవోలు బయలుదేరాడు. హైవేపై బద్దెవోలు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో వీరాస్వామి మృతిచెందగా సునీల్‌కుమార్‌కు గాయాలయ్యాయి.

సంక్షేమ పథకాలతో సరికొత్త చరిత్ర

- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

నాయుడుపేటటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను గడప గడపకు తీసుకెళుతున్నామని, సంక్షేమ పథకాల అమలులో సరికొత్త చరిత్ర సృష్టిస్తున్నట్లు సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని గొట్టిప్రోలు, తన్నమాల, రాచర్ల వడ్డికండ్రిగ గ్రామాల్లో శనివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యేకు పలుచోట్ల కర్పూరహారతులతో స్వాగతం పలికారు. గజమాలతో శాలువలు కప్పి సత్కరించారు. ఎమ్మెల్యే గ్రామాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వారిని ఆప్యాయంగా పలకరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేశారు. గ్రామస్తులు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే ప్రజలను కోరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సుబ్రహ్మణ్యం రెడ్డి, ట్రేడ్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణారెడ్డి, ఎంపీపీ ధనలక్ష్మి, నేతలు రాజారెడ్డి, కిషోర్ యాదవ్, వెంకట రమణయ్య, రమణయ్య, డీ రవీంద్ర, రఘు, ప్రసాద్‌రెడ్డి, రాహుల్, సుబ్బయ్య, మురళి, తహసీల్దార్ రాజేంద్ర, ఎంపీడీఓ శివప్రసాద్, హౌసింగ్ ఏఈ శ్రీనివాసులు, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీ మురళి పాల్గొన్నారు.


బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

టీడీపీ నేతలకు బుక్‌లెట్ల అందజేత..

టీడీపీ నేత, మాజీ మంత్రి పరసారత్నం స్వగ్రామమైన గొట్టిప్రోలు గ్రామంలో ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అపూర్వ ఆదరణ లభించింది. ఎమ్మెల్యే గ్రామంలో టీడీపీ నేతల ఇళ్లకు వెళ్లి వారు పొందిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందించారు. టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ పల్లమాల రామిరెడ్డికి వైఎస్సార్ సున్నావడ్డీ, రైతు భరోసా ద్వారా రూ.39, 166 లబ్ధిపొందిన బుక్‌లెట్‌ను ఆయన సతీమణికి అందించారు. అదేవిధంగా టీడీపీ నేత, సర్పంచ్ పరసా వెంకటరమణయ్యకు కూడా ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ద్వారా రూ.45,700 లబ్ధి పొందిన బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే వారికి అందజేశారు.

జగనన్న సుపరిపాలనకు సంక్షేమమే నిదర్శనం


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా అందిస్తున్న సుపరిపాలనకు రాష్ట్రంలో చేపట్టిన సంక్షేమం, అభివృద్ధే నిదర్శనమని జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జనరంజక పాలన సాగిస్తున్నారని అన్నారు. గత టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీల చుట్టూ ప్రదక్షిణలు చేసి చేతివాటంతో తృప్తి పరిస్తేనే పింఛన్ మంజూరు చేసేవారని గుర్తు చేశారు. కానీ వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు దరికి చేరుతున్నాయని చెప్పారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చొరవతో మారుమూల గ్రామాలకు సిమెంట్, బీటీ రోడ్లు ఏర్పాటు చేశారన్నారు. సుపరిపాలనను కొనసాగించుకోవడానికి మరోమారు జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, ఎంపీడీఓ సురేష్‌బాబు, డీటీ శ్రీనివాసులు, ఏఓ ప్రవీణ, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి, హెచ్‌ఓ శారద నేతలు బాలసుబ్రమణ్యం అమరేంద్రరెడ్డి, మోహన్, చెంగయ్య, మోహన్‌రెడ్డి, అశోక్, కృష్ణయ్య, కుమార్ పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికి ఆదర్శం


వలంటీర్లను అభినందిస్తున్న ఎంపీపీ తనూజారెడ్డి

వెంకటగిరిరూరల్: గ్రామస్వరాజ్యం దిశగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా రూపొందించిన వలంటీర్ వ్యవస్థ భారతదేశానికే ఆదర్శమని ఎంపీపీ తంబిరెడ్డి తనూజారెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని పద్మశాలీయుల కల్యాణమండపంలో శనివారం వెంకటగిరి రూరల్ మండలానికి సంబంధించి 20 పంచాయతీల పరిధిలోని వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో ఒకరికి సేవావజ్ర, ఐదుగురికి సేవామిత్ర, 136 మందికి సేవామిత్రలు ఎంపికవగా ఎంపీపీ చేతులమీదుగా ప్రతి వలంటీర్‌ను శాలువ, సర్టిఫికెట్, బ్యాడ్జితో ఘనంగా సన్మానించారు. పార్టీ నేతలు తంబిరెడ్డి శివారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు మస్తాన్, వెంకటగిరి పీఏసీఎస్ అధ్యక్షుడు కె వెంకటరత్నం రాజు, ఎంపీడీఓ కరిముల్లా, ఏఓ విజయలక్ష్మి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రశాంతంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం


సమావేశంలో నక్కా భానుప్రియ

వెంకటగిరి: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ అధ్యక్షతన శనివారం జరిగిన కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది. 25 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిలర్‌లు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తోందని, ఆ నిధులతో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు సీహెచ్ ఉమామహేశ్వరి, తురాశి బాలయ్య, మున్సిపల్ విప్ పూజారిలక్ష్మి, ఆర్‌ఐ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సుపరిపాలనకు వలంటీర్లే వారధులు


వలంటీర్లను సన్మానిస్తున్న నేతలు

పెళ్లకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలనకు గ్రామ వలంటీర్లే వారధులని మండల పరిషత్ అధ్యక్షుడు పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో చిల్లకూరు, జీలపాటూరు గ్రామ సచివాలయ పరిధిలోని వలంటీర్లను శాలువా, పూలమాలలతో సన్మానించి జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ పగడాల హరిబాబు రెడ్డి, ఎంపీడీఓ సురేష్‌బాబు, డీటీ శ్రీనివాసులు, నేతలు మోహన్‌రెడ్డి, చంద్రయ్యానాయుడు, చెంగయ్య, కృష్ణయ్య, కుమారస్వామి, మోహన్, వెంగమరాజు పాల్గొన్నారు.

కోట అభివృద్ధికి సహకరించాలి


రూట్ మ్యాప్ చూపిస్తున్న ఆర్డీఓ, డీఎస్పీ

కోట: కోట అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ అమలు చేస్తున్నామని ప్రజలు సహకరించాలని గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్ తెలిపారు. శనివారం కోటలో జరుగుతున్న అభివృద్ధి పనులను గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డితో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కోట బజారువీధిలో ఆక్రమణల తొలగింపు చేపట్టామన్నారు. ఆక్రమణల తొలగింపు, రోడ్డు నిర్మాణం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. అనంతరం కోట తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష జరిపారు. కోట అభివృద్ధికి సంబంధించి రూట్‌మ్యాప్‌ను ఆర్డీఓ, డీఎస్పీ ఆవిష్కరించారు. తహసీల్దార్ పద్మావతి, ఎంపీడీఓ భవాని, వాకాడు సీఐ హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రేక్షకుల అభిమానాన్ని మరువను


అభిమాని కుటుంబసభ్యులతో సుమన్

నాయుడుపేటటౌన్: తనను ఎంతగానో ఆదరించిన తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషలకు సంబంధించి ప్రేక్షకులను ఎప్పటికీ మరవనని నటుడు సుమన్ అన్నారు. పట్టణంలోని సుమన్ అభిమాన సంఘ నాయకులు షరీఫ్ ఇంటికి శనివారం సాయంత్రం వచ్చారు. ఆయన ఇక్కడ అభిమానులతో కలిసి సందడి చేశారు. ఎన్టీఆర్ శత జయంతి సందర్భంగా నెల్లూరులో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటున్నట్లు సుమన్ వెల్లడించారు.

పూరిళ్లు దగ్ధం

వెంకటగిరిరూరల్: స్థానిక సాలికాలనీకి చెందిన దాసరి పావని తన నివాసంలో గ్యాస్‌పై ఇంట్లో వంటచేస్తుండగా ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించి పూరిళ్లు దగ్ధమయ్యాయి. ఈఘటన పట్టణంలోని సాలికాలనీలో శనివారం చోటుచేసుకుంది. విషయం తెలిసి అక్కడికి చేరుకుని అగ్నిమాపకసిబ్బంది మంటలను అదుపుచేశారు. రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపారు.

ఎట్టకేలకు కడివేడులో రీ సర్వే


కడివేడులో సర్వే చేస్తున్న సర్వేయర్లు

చిల్లకూరు: కడివేడు రెవెన్యూ పరిధిలో భూములకు ఎట్టకేలకు రీ సర్వేను శనివారం రెవెన్యూ అధికారులు చేపట్టారు. మండలంలోని కడివేడులో 7 వేల ఎకరాల భూములు ఉండగా వాటిని గతంలో ఉమ్మడి జిల్లాగా ఉన్న సమయంలో అప్పటి జాయింట్ కలెక్టర్‌లు పలుమార్లు సర్వే చేయించారు. అయినా హద్దులు చూపించకపోవడంతో వివాదాలు నెలకొంటూనే ఉన్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సెంటు భూమిని కూడా కొలతలు వేసి రైతులకు హద్దులు చూపించేందుకు జగనన్న భూరక్ష పథకాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. కడివేడులోని భూములను సర్వే చేసేందుకు శ్రీకారం చుట్టారు. ముందుగా ఆముదాల కండ్రిగ ప్రాంతంలో సర్వే పనులను అధికారులు చేపట్టారు. మండల సర్వేయర్ రాంకుమార్, వీఆర్‌ఓ బాలాజి, సచివాలయ సర్వేయర్లు శశి పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


శ్రీనివాసులు

సైదాపురం: సైదాపురం మండల తహసీల్దార్‌గా శ్రీనివాసులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జి తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మిని కలువాయి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. ఆమె స్థానంలో దగదర్తి తహసీల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న శ్రీనివాసులును నియమించారు. ఆయన బాధ్యతలు స్వీకరించారు.

తహసీల్దార్‌కు వీడ్కోలు..


తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శనివారం బదిలీపై కలువాయికి వెళుతున్న తహసీల్దార్ విజయలక్ష్మిని సిబ్బంది ఘనంగా సత్కరించారు.

చెంగాళమ్మ బ్రహ్మోత్సవాలకు మూగ చాటింపు


మూగ చాటింపు పూజలు చేస్తున్న అర్చకులు

సూళ్లూరుపేట: చెంగాళమ్మ పరమేశ్వరికి జూన్ 8 నుంచి 14 వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు శుక్రవారం అర్ధరాత్రి మూగచాటింపు పూజలు చేశారు. ఆలయం నుంచి అర్చకులు పూజాసామగ్రిని తీసుకుని చాటింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామోత్సవం నిర్వహించే నాలుగురోడ్ల కూడళ్లలో మూగ చాటింపు పూజలు చేశారు. చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

ఈదురు గాలులతో కూలిన చెట్లు


రోడ్డుపై నేలకూలిన చెట్లు

గూడూరురూరల్: మండలంలోని కొండాగుంట- వెడిచెర్ల మార్గంలో శనివారం సాయంత్రం వీచిన ఈదురు గాలులు ధాటికి రోడ్డు పక్కనున్న చెట్లు నేలకూలాయి. దీంతో ఈ మార్గంలో ప్రయాణించే వాహనచోదకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

దివ్యాంగులకు రోటరీ భరోసా

గూడూరు: గూడూరులోని డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలు ప్రాంగణంలో శనివారం రోటరీ క్లబ్ గూడూరు వెస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగుల భరోసా కార్యక్రమాన్ని నిర్వహించారు. రోటరీ భరోసా కార్యక్రమం ద్వారా దివ్యాంగులకు ఫలసరుకులు అందజేశారు. నెల్‌క్యాస్ట్ కంపెనీ యాజమాన్యం దాతగా సహాయ సహకారాలు అందించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు ధనంజయరెడ్డి, నెల్‌క్యాస్ట్ కంపెనీ ప్రతినిధి వెంకటేష్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ మయూరి శ్యామ్ యాదవ్ పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తికి గాయాలు

వెంకటగిరి: తోలిమిట్టకు చెందిన టి సంతోష్ ఆ ప్రాంతంలో శనివారం ద్విచక్రవాహనం నడుపుతూ అదుపు తప్పి బోల్తాపడి గాయపడ్డాడు. గాయపడ్డ అతన్ని వెంకటగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు.

మహిళా రెజ్లర్లపై లైంగికదాడి హేయం

వెంకటగిరి: ఢిల్లీలో మహిళా రెజ్లర్లపై లైంగికదాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన రెజ్లర్ల సమాఖ్య అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణను అరెస్టు చేయాలని స్త్రీవిముక్తి సంఘటన రాష్ట్ర కమిటీ సభ్యురాలు అజిత, ఎస్ ఝాన్సీ తెలిపారు. స్థానిక కామ్రేడ్ శ్రీకాళహస్తి వేషయ్య స్మారక గ్రంధాలయం వద్ద శనివారం మహిళా రెజ్లర్ల పోరాటానికి సంఘీభావ కార్యక్రమం నిర్వహించారు.

పేదల ఇంట సంక్షేమ సిరులు


పాలూరులో లబ్ధిదారులకు బుక్‌లెట్‌ను అందజేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

- నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

సైదాపురం: సంక్షేమ పథకాలతో పేదల ఇంట ఆనందం వెల్లివిరుస్తోందని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని పాలూరు రాజుపాళెం మెయిన్, ఎస్సీ కాలనీ, పాలూరు కమ్మపాళెం, ఎస్సీ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. నేదురుమల్లికి స్థానికులు ఘనస్వాగతం పలికారు. నేదురుమల్లి ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి బుక్‌లెట్‌ను అందజేశారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ అక్కడికక్కడే కొన్ని సమస్యలను అధికారుల ద్వారా పరిష్కరించారు. పాలూరు దళితవాడ ప్రజలందరికి పక్కా గృహాలను మంజూరు చేస్తున్నట్లు ఆయన ఈసందర్భంగా వెల్లడించారు. నేదురుమల్లి మాట్లాడుతూ ప్రతి పేదవాని ఇంట సంతోషాలు చూడాలన్న లక్ష్యంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నారన్నారు. సమస్యలను స్వయంగా తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకే గడప గడపకు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. పాలూరు దళితవాడలో కుంచం యశ్వంత్ తమ తల్లిదండ్రులకు అందించే బుక్‌లెట్‌ను నేనే ఫొటో తీస్తానంటూ ఫొటో తీసి పార్టీపై ఉన్న తన మమకారం చాటుకున్నారు. రాష్ట్ర సంగీత నృత్య అకాడమీ చైర్మన్ పొట్టేళ్ల శిరిషా యాదవ్, జేసీఎస్ కన్వీనర్ రవికుమార్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్, సర్పంచ్ జనార్దన్‌రాజు, సొసైటీ అధ్యక్షుడు శివకుమార్, జెడ్పీటీసీ సభ్యుడు పోలయ్య, ఎంపీటీసీ సభ్యుడు ఈశ్వరరాజు, సర్పంచ్ తలమాల రమణమ్మ, నేతలు, ప్రభాకర్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి, శ్రీనివాసులురాజు, రామచంద్రరాజు, శంకర్‌రాజు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన


సంగవరంలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న పీడీ

వెంకటగిరిరూరల్: మండలంలోని జంగాలపల్లిలో జరుగుతున్న ఉపాధి హామీ అమృత్‌సరోవర్ పనులను ఎన్‌ఆర్‌ఐజీఎస్ పీడీ సీవీ శ్రీనివాసప్రసాద్ శనివారం పరిశీలించారు. ఏపీఓ దీప పాల్గొన్నారు. అదేవిధంగా బాలాయపల్లి మండలంలోని సంగవరం గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను పీడీ సీవీ శ్రీనివాసప్రసాద్ శనివారం పరిశీలించారు. ఏపీఓ మృత్యుంజయ పాల్గొన్నారు.

స్టాక్ పాయింట్ పరిశీలన


కిట్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ, తహసీల్దార్

సూళ్లూరుపేట: వచ్చేవిద్యాసంవత్సరం 2023–24 సంవత్సరానికి ముందుగానే విద్యార్థులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు, స్కూల్‌బ్యాగ్స్, బెల్ట్, యూనిఫాం, షూస్, సాక్స్‌లు దిగిన గోదామును సూళ్లూరుపేట ఆర్డీఓ ఆర్ చంద్రముని, తహసీల్దార్ కే రవికుమార్ శనివారం పరిశీలించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని గదిలో విద్యాకానుక సామగ్రిని భద్రపరిచారు. సామగ్రి నాణ్యతను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్ తనిఖీ చేశారు. విద్యా సంవత్సరం కావడమే తరువాయి విద్యార్థులకు వస్తువులన్నీ అందించేందుకు విద్యాశాఖాధికారులు పనిచేయాలని ఆర్డీఓ ఆదేశాలిచ్చారు.